క్లుప్తంగా

అందరూ మొక్కలు నాటాలి

కల్లూరు: సమాజంలో అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్, సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీడీఓ నాగేశ్వరచలరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘు

కల్లూరు: చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. శనివారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సల్కాపురం గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బేటీ బచావో, బేటీ పఢావో అనే నినాదంతో ఆడ పిల్లలను రక్షించాలి, ఆడపిల్లను చదివించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పాణ్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పాణ్యం : గ్రామాల శుభ్రతకు అందరూ పాటుపడాలని డీపీఓ లలితాబాయి పిలుపునిచ్చారు. శనివారం పాణ్యంలో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుగా అందజేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. పంచాయతీలో వర్మీ యూనిట్‌లో సేంద్రియ ఎరువు అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శ్రీకృష్ణ కల్యాణ మండపం నుంచి పాణ్యం ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: జిల్లాలోని పాణ్యం మండలం నెరవాడ గ్రామంలో ఏసుకృప మినిస్ట్రీస్ ట్రస్టు అధినేత అందం ఏసన్న ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి గ్రామంలో పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైద్యులు విజన్ ఐకేర్ డాక్టర్ పబ్బతి విజయమోహన్, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ రత్నాకర్ ఆధ్వర్యంలో పేదలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, అమర సింహారెడ్డి, కొప్పెర సునిల్, ఏసన్న, మనోహర్, బెనిహిన్, క్లైమెంట్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్లకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)పై పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎస్జీటీలకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎంటీఎస్ టీచర్ల జాబితాలను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టామని డీఈఓ పేర్కొన్నారు.

తగ్గిన వ్యవసాయ ఉత్పత్తులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వ్యవసాయ ఉత్పత్తులు రావడం తగ్గిపోయింది. ఉల్లి, ఎండుమిర్చి వంటి పంటలు కొద్ది రోజులుగా మార్కెట్‌కు రావడం లేదు. దీంతో మార్కెట్ యార్డు వెలవెలబోతోంది. కర్నూలు మార్కెట్‌లో మొదటిసారిగా వరి ధాన్యం క్రయవిక్రయాలకు అవకాశం కల్పించినప్పటికీ పంట తీసుకు రావడం లేదు. శనివారం కేవలం 33 మంది రైతులు వివిధ పంట ఉత్పత్తులు 197 క్వింటాళ్లు మాత్రమే తెచ్చారు. వేరుశనగ 41 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. కందులు 90 క్వింటాళ్లు వచ్చినప్పటికి ధర నిరాశజనకంగా లభించాయి. కనిష్ఠ ధర రూ.3070, గరిష్ఠ ధర రూ.6419 మాత్రమే లభించింది. కొర్రలు, మినుములు, సజ్జలు, మొక్కజొన్నలు అతి తక్కువగా వస్తున్నాయి.

కాల్వలు ఇలా... సాగునీరు అందేదెలా?

- అధ్వానంగా ఎస్సార్బీసీ పంట కాల్వలు
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- మరమ్మతుల ప్రతిపాదనలకు ఆమోదం
- ఖరీఫ్ ప్రారంభమైనా మొదలుకాని పనులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



ఆలమూరు సమీపంలో కాల్వకు అడ్డంగా దారి ఏర్పాటు చేసిన దృశ్యం



బ్లాక్-4 భూపనపాడు గ్రామం వద్ద కాల్వ దుస్థితి

పాణ్యం: ఎస్సార్బీసీ పరిధిలోని చివరి ఆయకట్టు రైతుకు నీరు అందించాలనే ఉద్దేశంతో ప్రధాన కాల్వల నుంచి బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. అయితే బ్లాక్‌లు నిర్వహణ సరిగా లేక శిథిలావస్థకు చేరడంతో ఆశయం నెరవేరడంలేదు. కాలువ ప్రతి అర కిలోమీటరుకు ఒక చోట కాల్వ దెబ్బతిని పొలాలు కోతలకు గురవుతున్నాయి. కాల్వ గట్టుపై రైతుల వ్యవసాయ యంత్రాలు వెళ్లాలన్నా భయపడాల్సిన నెలకొంది. కాల్వల మరమ్మతులకు ఇటీవల అనుమతులు వచ్చినా పనులు మొదలుకాలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధ్వానంగా కాలువలు

ఎస్సార్బీసీ బ్లాక్ల నిర్వహణ పూర్తిగా అధ్వానంగా ఉంది. పాణ్యం మండలంలో ఏడు బ్లాక్‌ల ద్వారా ఆయకట్టుకు నీరు అందుతుంది. బ్లాక్-2కాల్వ పాణికేశ్వర స్వామి దేవాలయం సమీపంలో దెబ్బతింది. అలాగే గోరుకల్లు రోడ్డు వద్ద కూడా కాల్వ సైడ్‌వాల్ దెబ్బతిని కోతకు గురవుతోంది. అలాగే బ్లాక్-3కాల్వ ఎస్సార్బీసీ కాలనీ వద్ద పూర్తిగా ధ్వంసం అయ్యింది. అలాగే నిర్వహణ లేని కారణంగా స్టీల్ ప్లాంట్ వద్ద కాల్వలో గడ్డి విపరీతంగా పెరిగిపోయింది. ఇక బ్లాక్-4 కాల్వకు కొణిదేడు వద్ద అడుగడుగునా దెబ్బతినింది. ఆలమూరుకు వెళ్లే దారిలో, భూపనపాడు వద్ద కాల్వలు ఛిద్రమైపోయాయి. కేవలం వీటితో పాటు ఐదవ బ్లాక్ పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది.

రైతన్నల ఎదురు చూపులు

కొన్నేళ్లుగా కాల్వల నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో రైతులు అనేక సార్లు అధికారులకు విన్నవిస్తే ప్రతిపాదనలు పంపారు. వాటికి ఆమోదం లభించినా పనులు మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఈ సారైనా పనులు చేస్తారా లేదా అనే ఆశతో ఎదురు చూస్తున్నారు. చాలా చోట్ల కాల్వలు కోతకు గురై పంట పొలాల్లోకి నీరు వెళ్తున్నాయి. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు.

ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ కింద సాగుభూమి వివరాలు..

బ్లాక్ పేరు	ఆయకట్టు విస్తీర్ణం (ఎకరాల్లో)
1	16,853
2	3,612
3	4,151
4	8,873
5	4,325
6	4,400
7	3,152
8	6,329
9	0,404
10	4,446
11	4,424
11ఏ	3,885
మొత్తం	1,04,854

పనులకు అనుమతి వచ్చింది

కాల్వల మరమ్మతులు చేసేందుకు రూ. 2కోట్లతో పంపిన ప్రతిపానదలకు ఆమోదం వచ్చింది. విశయాన్ని ఆయా డబ్ల్యూయూఏలకు తెలియజేశాం. త్వరలోనే పనులు చేపడతాం. పనులు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తాం. ప్రధానంగా కాల్వలకు రిపేరి చేయడం, కాంక్రిట్ పనులు చేపట్టడం, కోతకు గురైన చోట బండ్ పనులు చేయిస్తాం. నీళ్లు వచ్చే సయానికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– క్రిష్ణన్న, ఈఈ కడా విభాగం

కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై గ్రామస్తులు, భక్తులకు స్వామివారి ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భద్రతా నియమాలు పాటించాలి

కర్నూలు: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలతో పాటు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు సూచించారు.

మోదీ మెప్పు కోసం గిరిజన విద్యార్థులకు ఇబ్బందులా?



వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె. గౌతమ్

కర్నూలు(టౌన్): దేశ ప్రధాని మెప్పు కోసం గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె. గౌతమ్ అన్నారు. గిన్నిస్‌బుక్ రికార్డు కోసం వేలాది మంది సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులను, గిరిజన విద్యార్థులను అర్ధరాత్రి 2 గంటల సమయంలో బస్సులో తరలించడం దారుణమన్నారు. యోగా నిర్వహించే ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇదే తరహాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల పిల్లలను తరలిస్తారా అని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థులకు జ్వరం, వాంతులు వస్తే ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లు ఉండవని, అదే యోగాంధ్రకు మాత్రం ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేశారన్నారు. నిజంగా ఈ ప్రభుత్వానికి గిరిజన విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ప్రారంభించాలని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఔషధ నియంత్రణ శాఖ డీడీ బదిలీ

కర్నూలు (హాస్పిటల్): ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశేఖర్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయనను విశాఖపట్నంకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఒడిశా వాసి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఒడిశా వాసి

కర్నూలు: ఉపాధి నిమిత్తం వలస వచ్చి కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నివాసముంటున్న ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ గ్రామానికి చెందిన సుశాంత్ కుమార్ దాలియా (36) చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన స్థానిక జీఎస్ ప్లాస్టిక్ రీ సైక్లింగ్ ఫ్యాక్టరీలో నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న ఈయన శుక్రవారం రాత్రి భార్య మున్నీకి ఫోన్ చేశాడు. మాటల సందర్భంలో ఆమెతో గొడవ పడి క్షణికావేశంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతుండగా ఫ్యాక్టరీ మేనేజర్ ప్రదీప్ చుట్టు పక్కల వారి సహాయంతో ఉరి నుంచి తప్పించి వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీ కేంద్రంలో భద్రపరచి మృతి సమాచారాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు చేరవేశారు.

సబ్ జైలు తనిఖీ

ఆదోని రూరల్: పట్టణంలోని సబ్‌జైలును శనివారం జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె. సుధ సందర్శించారు. ఖైదీల వివరాలను, వారికి అందుతున్న సేవలపై జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. క్షణికావేశంలో జైలుకు వచ్చి ఉంటారని, ఇకనైనా మంచి నడవడికను నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయ సేవాధికార సంస్థ వారిని సంప్రదించాలని సూచించారు. జడ్జి వెంట న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, జైలు అధికారులు ఉన్నారు.

రూ.6 కోట్లతో సీ క్యాంపు రైతుబజారు విస్తరణ

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సి.క్యాంపు రైతుబ బజారును రూ.6 కోట్లతో విస్తరించనున్నారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 110 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పులో విస్తరించడానికి మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. అండర్ గ్రౌండ్‌లో పార్కింగ్ సదుపాయం కూడా ఉంటుంది. 130 షెడ్లు, 60 షాపులు ఉంటాయని అధికార వర్గాలు తెలిపాయి.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



పెసరవాయిలో అతిసార నివారణ పోస్టరును విడుదల చేస్తున్న దృశ్యం

గడివేముల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన అవసరమని నంద్యాల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డాక్టర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావున అతిసార కేసులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పెసరవాయిలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసి పోస్టర్లను విడుదల చేశారు. ఆయన వెంట డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓలు జగదీశ్వరప్ప, మహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పీ అలీబాషా, ఏఎన్‌ఎం దేవకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

నేడు సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: గాన గంధర్వ పద్మ భూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతిని పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన గాయకులు బాలకోటేశ్వరరావు, హనుమంతరావు, రాధిక, కర్నూలు గాయని ప్రియాంకలు సంగీత విభావరిలో ఎస్పీ బాలు పాడిన పాటలను గానం చేస్తారని పేర్కొన్నారు.

యువత మత్తుకు బానిస కాకుండా చూడాలి

- ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్



మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య విద్యార్థులు, డాక్టర్లు

కర్నూలు : యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా చూడాలని, ఈ విషయలంలో వైద్యులు కీలకపాత్ర వహించాలని ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్ సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం విద్యార్థులకు నషా ముక్త్ భారత్ అభ్యాన్, ఈగల్ క్లబ్స్ గురించి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, సోమశేఖర్‌తో పాటు ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్ పాల్గొని మాట్లాడారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా భవిష్యత్తు వైద్యులు వారిని చైతన్య పరచాలన్నారు. మత్తు వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరిస్తూ వారిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించాలని కోరారు. అలాగే ఆసుపత్రికి పేషెంట్లుగా వచ్చే వారికి కూడా ఆరోగ్య జాగ్రత్తల పట్ల సలహాలు ఇవ్వడం ద్వారా మార్పు తేవాలన్నారు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, పునరావాస కేంద్రాల ద్వారా బాధితులను మళ్లీ సామాజిక జీవనానికి అలవాటు చేయడం వంటివి వైద్యులతోనే సాధ్యమని చెప్పారు.

ఘనంగా యోగా దినోత్సవం



శ్రీకృష్ణ కల్యాణ మండపంలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు



చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో యోగా కార్యక్రమం

పాణ్యం/కల్లూరు/గడివేముల: ప్రపంచ యోగా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా ఘనంగా నిర్వహించారు. పాణ్యం మండలంలో 147 ప్రదేశాల్లో యోగాధ్ర కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రమైన పాణ్యంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీఓ లలితాబాయి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంఈఓ కోటయ్య, పశుసంవర్ధకశాఖ ఏడి కమలాకర్, డీర్‌ఓ విజయలక్ష్మీ, ఈఓ ఆనందరావు, ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

- కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డీసీఓ ఐ.శ్రీదేవి, మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గడివేముల జెడ్పీ పాఠశాలలో ఎంపీడీఓ వాసుదేవగుప్తా, రాజరాజేశ్వరీ పాఠశాలలో తహసీల్దార్ వెంకటరమణ, కస్తూర్బా ఎస్ఓ రుబీనా ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

కోడుమూరు రూరల్/సి.బెళగల్: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోడుమూరులోని నాగార్జున విద్యానిలయంలో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి ఎస్ఐ ఎర్రిస్వామి ముఖ్య అతిథిగా హాజరై యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే కోడుమూరు బాలుర హైస్కూల్లో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ తైమూర్‌బాషా పాల్గొన్నారు. యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. గూడూరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. అలాగే సి.బెళగల్‌లో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఆదోని డీఎల్‌డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



కోడుమూరు బాలుర హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



సి.బెళగల్: ముడుమాల జెడ్పీ స్కూల్‌లో నేలపైనే విద్యార్థులతో యోగా చేయిస్తున్న ఉపాధ్యాయులు

‘ఎల్లార్తి’లో భక్తులు, నిర్వాహకుల మధ్య గొడవ

- చదివింపులు, దర్శనంపై వాగ్వాదం



ఎలార్తి దర్గాలో భక్తులు, సిబ్బంది మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి షెక్షావలి, షాషావలి దర్గాలో శుక్రవారం రాత్రి దర్గా నిర్వాహకులు, దర్శనం కోసం వచ్చిన గుంతకల్లు ప్రాంతానికి చెందిన భక్తుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గుంతకల్లుకు చెందిన నవాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లార్తి దర్గాకు వచ్చారు. దర్గాలో దువా, చదివింపుల విషయంలో వారికి, నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. హుండీలో వేసే కానుక, టెంకాయ కొట్టేందుకు తాము అడిగిన మొత్తాన్ని ఇవ్వాలని దర్గాలోని సిబ్బంది డిమాండ్ చేశారని, ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించినందుకు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ గొడవకు దిగారని నవాజ్ ఆరోపించాడు. అలాగే ఆయన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దర్గాకు కోట్ల ఆదాయం వచ్చినా బాత్‌రూంలు, మరుగుదొడ్లు ఇతర వసతులు లేవని భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. కాగా దర్శనానికి వెళ్లిన సమయంలో భక్తులు, నిర్వాహకులు మధ్య తోపులాట, దాడులు చేసుకున్నట్లు తెలిసింది. తమరు కొట్టారని భక్తులు ఆరోపించారు. కాగా ఈ ఘటనకు రాజకీయం పులిమి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వివాదాన్ని దారి మళ్లించేందుకు యతిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల దర్గాల విషయంలో వివాదాలు, విమర్శలు, సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు



పాకెట్ పార్కులో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(హాస్పిటల్): మన నిత్య జీవితంలో ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. శాంతికళ కోరారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ అరుణ, డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, డీపీఎంఓ డాక్ట ర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ ఉమామహేశ్వరప్రసాద్, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎస్ఓ హేమసు ందరం,డీపీహెచ్ఎన్ఓ అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ ఆసుపత్రి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాల ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అనంతరం సదరం క్యాంపు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో...

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో పరిసరాలను పరిశుభ్రం చేయడం, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, వైద్యులు మంజులబాయి, శోభారాణి, సోమశేఖర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కర్నూలు (టౌన్) : నగరంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగరపాలక సంస్థ కమి షనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం స్థాని క స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీ నది ఒడ్డున నూతన పాకెట్ పార్కులో మొక్కలు నాటారు. అలాగే 500 మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు

కానరాని చినుకు జాడ



గడిగరేవుల గ్రామంలో విత్తనాలు వేసేందుకు రైతు సిద్ధం చేసుకున్న పొలం

గడివేముల: వానాకాలం వచ్చినా ఆకాశంలో మబ్బులే తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. వ్యవసాయానికి అవసరమైన వర్షాలు లేకపోవడంతో రైతులు కొంతమేర ఆందోళన చెందుతున్నారు. అసలైన తొలకరి పలకరింపు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆరంభంలోనే వరుణ దేవుడు కరుణించకపోవడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనులు చేపట్టలేకపోతున్నారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకుని అక్కడక్కడ పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటారు. విత్తనాలు మొలకెత్తినా గాలులు విపరీతంగా వీస్తుండటంతో పాటు కార్తెలు వెళ్లిపోతున్నా నేటికీ సరైన వర్షాలు కురవకపోవడంతో ఎదుగుదల లేదు. ఇక వర్షాకాలంలోని ఎండలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలు కురుస్తాయని ఆశతో రైతులు పొలాలు సేద్యం చేసి విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఏడాది దాదాపు 22 వేల దాకా వివిధ పంటలను సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.